క్లుప్తంగా

జోగులాంబ సన్నిధిలో ఐఎఫ్ఎస్ అధికారి



జోగులాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను సోమవారం ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారి పురేందర్ కుమార్ సాదర స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగులాంబ అమ్మవారికి కుంకుమ అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు వారికి క్షేత్ర ప్రాశస్త్యం తెలిపారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

ఆలయంలో డీఎస్పీ పూజలు



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సోమవారం డీఎస్పీ సత్యనారాయణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ సిబ్బంది, ఎస్ఐ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

గద్వాల మున్సిపల్ కమిషనర్‌గా దశరథ్



గద్వాల: స్థానిక మున్సిపాలిటీ కమిషనర్‌గా దశరథ్ నియామకం అయ్యారు. డీఎంఏ ఉత్తర్వుల మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన జీహెచ్ఎంసీలో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న శంకర్‌సింగ్ జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దశరథ్‌కు మున్సిపల్ అధికారులు, పలువురు కౌన్సిలర్లు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశం అయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతి సాధిస్తామని చెప్పారు. పారిశుద్ధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. కమిషనర్ దశరథ్ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌లను వేర్వేరుగా కలిశారు.

ఎంపీడీఓగా ఆంజనేయరెడ్డి



మల్దకల్: మండల ఎంపీడీఓగా ఆంజనేయ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కేటీదొడ్డి మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై మల్దకల్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ బది లీపై వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు.

వీధికుక్కల బారినుంచి కాపాడండి



శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకలలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయని, వాటి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కుక్కల బారిన పడి గొర్రెలు చనిపోతున్నాయని, కుక్కలు కరిచి ప్రజలు చనిపోయే ప్రమాదం ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రామకృష్ణ, బంకు నరసింహ, మహేష్‌గౌడ్, జగదీష్, బడేసాబ్, మద్దిలేటి, సుధాకర్, కిష్టన్న, రవి, రాఘవేంద్రగౌడ్ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

అలంపూర్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందిపై కేసు నమోదైనట్లు తెలిపారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో సోమవారం వారిని హాజరుపరచగా, 12 మందికి రూ. 2 వేల చొప్పున జరిమానా, జైలు శిక్ష జడ్జి కమలాపురం కవిత విధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మరో నలుగురికి రూ.2వేల చొప్పున జరిమాన విధించారు.



కేటీదొడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్‌లో..



అయిజ మండలం ఉత్తనూరులో..



ఉండవెల్లి మండలం తక్కశీలలో..

గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

అలంపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలో కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రతి వార్డు స్వచ్ఛతగా ఉంచడానికి అందరూ కలిసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, అధికారులు, ఆర్‌పీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని స్వచ్ఛదనం–పచ్చదనంపై గ్రామ ప్రజలతో పంచాయతీ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమస్యలను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకొస్తే వెంటనే నమోదు చేసుకుని దశలవారిగా పరిష్కరిస్తామన్నారు.

మొక్కలు నాటండి

శాంతినగర్: ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పంచాయతీ కార్యదర్శి హిమబిందు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.



అలంపూర్‌లో స్వచ్ఛదనం పచ్చదనంకార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మానవపాడు: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం చంద్రశేఖర్‌నగర్‌లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎంపీఓ భాస్కర్ ప్రారంభించారు.

అయిజ: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఉత్తనూరు, సంకాపురంలో కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశీల, కంచుపాడు, ఇటిక్యాలపాడులో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఎంపీఓ తిరుపతన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.

రాజోళి: గ్రామాల్లోని పరిసరాలు శుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రత్యేక అధికారి ఖాజా మెయినుద్దీన్ అన్నారు. మండలంలోని తూర్పుగార్లపాడులో సోమవారం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పరసరాలను శుభ్రం చేశారు.

ధరూరు: గ్రామాలు ఆకుపచ్చగా మరాలని ఎంపీడీఓ మంజుల తెలిపారు. సోమవారం మండలంలోని పారుచర్ల, ధరూరు, కోతులగిద్దలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ర్యాలీ నిర్వహించినట్లు వారు తెలిపారు.

మల్దకల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం– పచ్చదనంపై ర్యాలీలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ సూచించారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని వేములలో పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛదనం–పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

అయిజ: మున్సిపాలిటీలోని పాత బస్టాండ్‌లో చైర్మన్ చిన్న దేవన్న, ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి మున్సిపల్ సిబ్బందితో కలిసి మానవహారం నిర్మించారు. పట్టణంలోని ప్రధాన రోడ్లపై ర్యాలీ చేపట్టారు.

గట్టు: గ్రామాల్లో స్వచ్ఛదనంతో పాటుగా పచ్చదనం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. సోమవారం తుమ్మలపల్లిలో కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు.



రాజోళి మండలం తూర్పుగార్లపాడులో..



ఎర్రవల్లి మండలం వేములలో..



మల్దకల్ మండలం అమరవాయిలో..



వడ్డేపల్లి మండలం కొంకలలో..



ధరూరు మండలం పారుచర్లలో..



గట్టు మండలం తుమ్మలపల్లిలో..

చేనేత సమస్యలపై ఎంపీకి వినతి

రాజోళి: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండల చేనేత కార్మికులు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందచేశారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయనను కలిసిన కార్మికులు చేనేత వస్త్రాలతో సన్మానించారు. కాగా గత ప్రభుత్వంలోని ఆర్‌డీ 1, ఆర్‌డీ 2లో కార్మికులు డబ్బులు పొదుపు చేసుకునే పథకంపై ఇంతవరకు స్పష్టత లేదని, అర్థాంతరంగా నిలిచిన ఈ పథకంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వీటితో పాటుగా మగ్గం కార్మికులు ప్రస్తుతం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, అవి ఏళ్ల తరబడి అలాగే ఉన్నా నేటికి అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, నిషాక్, షేక్షావలి, వాహీద్, ఈశ్వర్, లోకేష్ నాయుడు, రాజేష్ కుమార్ తదిదరులు పాల్గొన్నారు.

బస్సు కోసం రోడ్డుపై బైఠాయింపు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం విద్యార్థులు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్సులు పర్దిపురంలో నిలపడం లేదని, దీంతో పాఠశాల సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. అరగంట సమయం విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు చేరుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసచారి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పారు. దీంతో విద్యార్థులు రోడ్డుపైనుంచి పక్కకు వెళ్లిపోయారు. ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహను వివరణ కోరగా, సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.



రోడ్డుపై బైఠాయించిన పాఠశాల విద్యార్థులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

గట్టు: కేరళ రాష్ట్రంలో వయనాడ్‌లో వరద బాధితుల కోసం సీపీఎం పార్టీ నాయకులు సోమవారం మాచర్ల, బల్గెరలో విరాళాలను సేకరించారు. వయనాడ్ ప్రాంతం అతలాకుతలం అయ్యిందని, ఇతర రాష్ట్రాల ప్రజలు వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని నాయకులు కోరారు. మొత్తం రూ.4,650 వసూలు కాగా, వాటిని కేరళ ప్రభుత్వానికి పంపనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నర్మద, నర్సింహులు, కర్రెప్ప తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



సద్దలోనిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మల్దకల్: పుట్టిన పిల్లలకు తల్లిపాలే ఆరోగ్యాన్నిస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని సద్దలోనిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై వివరించారు. ప్రతి ఒక్కరూ పోషకాలు ఉండే ఆహారం తీసుకోవడంతో పాటు పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, సువర్ణ, ఏఎన్ఎం గౌసియా తదితరులు పాల్గొన్నారు.



జల్లాపురంలో అన్నప్రాసన నిర్వహిస్తున్న సీడీపీఓ సుజాత

మానవపాడు: తల్లిపాలు అమృతం కంటే గొప్పవని పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అందించాలని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమరవాయిలో ఆరోగ్య ఉపకేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, ఏఎన్ఎమ్ మాబమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అన్నప్రాసన కార్యక్రమం

మండలంలోని జల్లాపురంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా సీడీపీఓ సుజాత అధ్యక్షతన సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

దళిత మృతవీరుల సభను విజయవంతం చేయండి

ఎర్రవల్లిచౌరస్తా: జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో మంగళవారం నిర్వహించే దళిత మృతవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ సోమవారం ప్రకటనలో కోరారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా దళితులపై దాడులు, వారి స్థితిగతులు ఏమాత్రం మారలేదని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వర్షం కోసం పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో 101 బిందెలతో కృష్ణా, తుంగభద్ర నది నీటిని తెచ్చి అభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకాలు నిర్వహించి, శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గోద జయ్యన్న, గోవిందు, శ్రీను, జ్ఞానేశ్వర్ రెడ్డి, చిన్న నాగేంద్రం పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలి

గద్వాల అర్బన్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 7న ఉదయం 10గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మదనపల్లికి చెందిన రవి, మహాలక్ష్మి కలిసి బైక్‌పై ఎర్రవల్లి వైపు సోమవారం సాయంత్రం వెళ్తున్నారు. ఈ క్రమంలో గద్వాల మండలంలోని పుటాన్‌పల్లి స్టేజి సమీపంలో రోడ్డుపై గుంత ఉండడంతో బ్రేక్ వేశాడు. రవి బైక్‌ను అదుపు చేయలేక ముందున్న బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా, రవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ తరలించారు.

డీసీఎం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై డీసీఎం బోల్తాపడింది. సోమవారం కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న డీసీఎం అదుపు తప్పి కంచుపాడు శివారులోని పెట్రోల్ బంకు సమీపలో బోల్తా బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. ఇందులో డ్రైవర్ బాషాకు తీవ్ర గాయాలవడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికిలో తరలించారు. డీసీఎంలో చెత్తను తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు సోమవారం ఎమ్మెల్యే విజేయుడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. జల్లాపురం చెందిన సయ్యద్‌షేక్షావలి రూ.54వేలు, పల్లెపాడు ఉమా రూ.37,500, లావణ్యకు రూ.8,500, కురువ దేవరాజ్ రూ.32వేలు, అంజనమ్మకు రూ.10వేలు, పద్మకు రూ.6వేలు, బోరవెల్లికి చెందిన సుధాకర్‌కు రూ.33వేలు, రుక్మమ్మకు రూ.15,500, కృష్ణమ్మకు రూ.54వేలు, నారాయణపురం చెందిన మహ్మద్ షబాన రూ.6,500, శ్రీనివాస్‌రెడ్డి రూ.15వేలు, శివన్నకు రూ.60వేలు, అమరవాయి చెందిన భాషకు రూ.6,500, మానవపాడు చెందిన బోయ నర్సింహులుకు రూ.60వేలు, గోకులపాడు చెందిన బీసమ్మకు రూ.9,500, చంద్రశేఖర్‌నగర్ చెందిన లక్ష్మీకుమారి రూ.29,500, మద్దూరులో పెద్ద మద్దిలేటి రూ.19,500, శ్రీకాంత్ రూ.32వేలు, ఆయా గ్రామాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌రెడ్డి, సోమన్నగౌడ్, శేషిరెడ్డి, దామోదర్‌రెడ్డి, గొల్ల వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో ఇటీవల బీఆర్ఎస్ నాయకుడు మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా జల్లాపురంలో చిన్నారెడ్డికి రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా, ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు.

బీచుపల్లిలో శ్రీరామ నామ భజనలు



బీచుపల్లిలో భజన చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని రామవదూత కళామండలి ఆధ్వర్యంలో శ్రీరామ నామ భజనలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిలాల్లోని పలు మండలాలకు చెందిన భజన బృందాలు పాల్గొని భజనలు చేశారు. ఆలయంలో 24 గంటల పాటు ఏకదాటిగా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

శివాలయంలో పూజలు

శివాలయంలో కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శివుడిని ప్రత్యేకంగా అలంకరించి పలు అభిషేకాలు చేపట్టారు.

ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనలు

మల్దకల్: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. సోమవారం కర్ణాటకకు చెందిన శేషదాసుల వారి శిష్యబృందం సభ్యులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారం రోజుల పాటు కొనసాగనున్న ఈ సప్తాహ భజనల కార్యక్రమాలను తిలకించేందుకు భజన మండలి సభ్యులు, భక్తులు హాజరవుతున్నారు.



మల్దకల్‌లో సప్తాహ భజనలు చేస్తున్న భక్తులు



బీచుపల్లిలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

వదంతులు నమ్మొద్దు.. రక్షణ కల్పిస్తాం

అయిజ: ఇటీవల బీసీ, ఎస్టీ హాస్టళ్లలో జరిగిన కొన్ని ఘటనల గురించి సోమవారం సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని నమ్మవద్దని ఎస్సీ హాస్టల్ వార్డెన్ కృష్ణయ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస ఆచారి వివరణ ఇచ్చారు. 15 రోజుల క్రితం బీసీ హాస్టల్ చెందిన పదో తరగతి విద్యార్థి హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లాడని, అక్కడ నుంచి బహిర్భూమికి గద్వాల రోడ్డువైపు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తిని విద్యార్థిని మత్తుమందు ఇచ్చారని, వాహనంలో తీసుకెళ్లారని, గద్వాలకు వెళ్లగానే రమేష్ డోర్ తీసుకొని దూకి పారిపోయి గద్వాలలో రైలెక్కి నంద్యాలకు వెళ్లాడని, అక్కడ నుంచి మళ్లీ కర్నూల్‌కు వెళ్లి తల్లిదండ్రులను కలుసుకున్నాడని తెలిపారు. అయితే ఇవన్నీ విద్యార్థి చెప్పిన మాటలేనని అవి మాటలు నమ్మశక్యంగా లేవని తెలిపారు. అదేవిధంగా వారం రోజుల క్రితం ఎస్సీ హాస్టల్ వద్దకు కొందరు వ్యక్తులు కత్తులు తీసుకొని వచ్చినట్లు ప్రచారం జరుగుతుందని, అయితే పక్క వీధి పిల్లలు హాస్టల్ విద్యార్థులతో పగలు గొడవపడ్డారని, రాత్రి విద్యార్థులను బయపెట్టేందుకు కత్తులు చూపించి పారిపోయారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని, నిర్భయంగా హాస్టళ్లలో ఉండవచ్చని, భద్రత కల్పిస్తామని హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.